సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం ; 13 ; జూన్ ; 2025



ఊపందుకోని సాగు
తొలకరి పలకరించినా వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వానాకాలం పంటల సాగు ఇంకా ఊపందుకోలేదు. 8లో



బాలలు బడిలోనే ఉండాలి
బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని, బాల కార్మికులుగా ఎవరూ మిగలొద్దని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
35° / 26°
జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు గురువారం 108 సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. ఆ తర్వాత హారతి, మంత్రపుష్పం, నివేదన సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి, వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

రామయ్య సన్నిధిలో ఏపీ హైకోర్టు జడ్జి



ఆలయంలో జడ్జి గోపాలకృష్ణ తదితరులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని ఏపీ హైకోర్టు జడ్జి గోపాలకృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమమూర్తులను దర్శించుకున్నాక శ్రీ లక్ష్మీతాయారమ్మవారి సన్నిధిలో అర్చకులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామి వారి జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో భద్రాచలం జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ శివనాయక్, ఆలయ ఏఈఓ శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజేందర్



మాట్లాడుతున్న రాజేందర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.రాజేందర్ అన్నారు. ప్రపంచ బాల కార్మిక దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం పెద్ద బజారులోని హమాలీ కార్మికులతో గురువారం నిర్వహించిన న్యాయ అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. పేదరికంతో చాలామంది బాలలు కార్మికులుగా మారుతున్నారని అన్నారు. అనంతరం కిరాణా షాపులను తనిఖీ చేశారు. చిన్న పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని యజమానులకు సూచించారు. కార్యక్రమంలో కొత్తగూడెం సహాయ కార్మిక శాఖ అధికారి షర్ఫుద్దీన్, మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లపోతు సాయి, హమాలీ కార్మిక సంఘం అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

36 మంది సర్వే అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం) : సింగరేణిలోని వివిధ ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న 36 మంది సర్వే అధికారులను బదిలీ చేస్తూ ఈఈ సెల్ విభాగాధిపతి ఎ.జె. మురళీధర్ రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో ఏడుగురు సర్వే అధికారులు, 29 మంది జూనియర్ సర్వే అధికారులు ఉండగా.. వీరంతా ఈనెల 21లోగా కేటాయించిన ఏరియాల్లో జాయిన్ కావాలని సూచించారు.



ఆరు నెలలైనా.. ఆచూకీ లేదు!

ఆగిన ఆర్గానిక్ ఫార్మింగ్ ఇన్‌స్టిట్యూట్
- జిల్లాకు మంజూరైన జాతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం
- గత నవంబర్‌లో ప్రకటించిన మంత్రి తుమ్మల
- ఎక్స్‌లెన్స్ సెంటర్ వస్తే సేంద్రియ సాగుకు మంచి రోజులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రతిష్టాత్మక సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ ఆర్గానిక్ అండ్ నేచురల్ ఫార్మింగ్ ఇన్‌స్టిట్యూట్ జిల్లాకు మంజూరైనట్టు ప్రకటన వచ్చి ఆరు నెలలు దాటింది. కానీ ఇప్పటి వరకు ఈ అంశంపై ఎలాంటి పురోగతి లేదు. దీంతో ఎక్స్‌లెన్స్ సెంటర్‌ను జిల్లాకు తీసుకొచ్చే వరకూ ప్రజాప్రతినిధులు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

దేశంలో ఐదు ఇన్‌స్టిట్యూట్‌లు..
ప్రస్తుతం నేషనల్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అండ్ నేచురల్ ఫార్మింగ్‌కు సంబంధించి దేశ వ్యాప్తంగా జోన్ల వారీగా ఐదు ఇన్‌స్టిట్యూట్‌లు పని చేస్తున్నాయి. ఇందులో సౌత్ జోన్‌కు సంబంధించిన సంస్థ బెంగళూరులో ఉంది. దీనికి అనుబంధంగా పని చేసే సెంటర్‌ను తెలంగాణకు మంజూరు చేశారు. ఈ కేంద్రాన్ని కొత్తగూడెంలో నెలకొల్పాలని మంత్రి తుమ్మల నిర్ణయించారు. ఇక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆయిల్ పామ్ తరహాలో పూర్తి స్థాయి సంస్థగా ఈ కేంద్రం అప్‌గ్రేడ్ అయ్యే అవకాశం ఉంది. అయితే ఆరు నెలలు గడిచినా ఈ అంశంపై మరో ప్రకటన రాకపోవడంతో జిల్లా రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులోకి వస్తే..
వ్యవసాయ రంగంలో పని చేస్తున్న యూనివర్సిటీలు, పరిశోధనా కేంద్రాలు, సేంద్రియ వ్యవసాయంలో పని చేస్తున్న ఎన్జీఓలు, ప్రైవేటు కంపెనీలు, పరిశ్రమలు, ప్రజాప్రతినిధులంతా సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ ఆర్గానిక్ అండ్ నేచురల్ ఫార్మింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో భాగస్వాములుగా ఉంటారు. వీరు స్థానిక రైతులకు, వ్యవసాయ సంఘాలకు సేంద్రియ సాగులో మెళకువలపై శిక్షణ ఇస్తారు. ఇక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా ఇతర జిల్లాలకు ఆయా సేవలు, నైపుణ్యాన్ని విస్తరిస్తారు. తెలంగాణకు మంజూరైన సేంద్రియ వ్యవసాయ పరిశోధన సంస్థలో పని చేసేందుకు దేశ వ్యాప్తంగా పేరెన్నిక గల శాస్త్రవేత్తలు వస్తుంటారు. వీరి రాకపోకలకు సులువుగా ఉండేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటుంది. ఇప్పటికే కొత్తగూడెం మీదుగా రెండు జాతీయ రహదారులు వెళ్తుండగా, రైలు కనెక్టివిటీ కూడా ఉంది. రాబోయే నాలుగేళ్లలో కొత్తగూడెంలో విమానాశ్రయ ఏర్పాటుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. దీంతో ఈ సంస్థను కొత్తగూడెంలో ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది.

ఆర్గానిక్‌కు డిమాండ్
వ్యవసాయ రంగంలో ఇప్పటికే పురుగుల మందులు, ఎరువుల వినియోగం గరిష్ట స్థాయికి చేరుకున్నాయనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. దీంతో రసాయనాలు వాడకుండా సహజ సిద్ధమైన పద్ధతిలో సేంద్రియ ఎరువులు, మందులు వాడుతూ పండించే పంటలకు మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతోంది. అయితే సేంద్రియ సాగును లాభసాటిగా మార్చే పద్ధతులు, నైపుణ్యంపై రైతులకు సరైన అవగాహన, శిక్షణ లేదు. దీంతో కొందరు ఔత్సాహికులు, కొన్ని కార్పొరేట్ కంపెనీలు సేంద్రియ సాగుపై దృష్టి సారించాయి. ఈ క్రమంలో ఎక్స్‌లెన్స్ సెంటర్ అందుబాటులోకి వచ్చి సేంద్రియ సాగుపై ఉన్న అపోహలు, భయాలు తొలగితే ఇతర ప్రాంతాల రైతులకు జిల్లా అన్నదాతలు మార్గదర్శిగా నిలిచే అవకాశం ఉంటుంది.

గతేడాది నవంబర్‌లో ప్రకటన..
గత సెప్టెంబర్‌లో మున్నేరు ఉప్పొంగి ఖమ్మం నగరాన్ని అతలాకుతలం చేసింది. వరద బాధితులను పరామర్శించేందుకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఖమ్మంలో పర్యటించారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ సెక్టార్‌లో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను తెలంగాణకు మంజూరు చేయాలని మంత్రి తుమ్మల కోరగా.. రెండు నెలల తర్వాత కేంద్రం నుంచి సానుకూల స్పందన వచ్చింది. దీంతో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ ఆర్గానిక్ అండ్ నేచురల్ ఫార్మింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను త్వరలో కొత్తగూడెంలో ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరావు 2024 నవంబర్ 26న ప్రకటన చేశారు. అంతకుముందు పామాయిల్ రైతులు ఈ అంశాన్ని మంత్రి తుమ్మల దృష్టి తీసుకెళ్లగా ఈ సెంటర్‌కు సంబంధించిన తొలి అడుగు పడింది.

మూడు రోజుల్లో విద్యార్థులంతా చేరాలి



పాల్వంచ బాలికల ఆశ్రమ పాఠశాలను పరిశీలిస్తున్న రాహుల్

- హాస్టల్ వార్డెన్లు, హెచ్‌ఎంలు ఈ మేరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- వసతిగృహాలకు వచ్చే విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలి
- హాస్టళ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపండి
- ఐటీడీఏ పీఓ రాహుల్ ఆదేశం

పాల్వంచరూరల్ : గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, పోస్ట్‌మెట్రిక్, ప్రీ మెట్రిక్ హాస్టళ్ల విద్యార్థులంతా సోమవారం లోగా చేరుకునేలా వార్డెన్లు, ప్రధానోపాధ్యాయులు చర్య తీసుకోవాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. హాజరు కాని విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించాలని అన్నారు. పాల్వంచ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, కొత్తగూడెంలోని పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ హాస్టళ్లను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హాస్టల్ గదులు, డార్మెటరీ, డైనింగ్ హాళ్లు, బాతురూమ్‌లు, వంటగదులు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సుమారు రెండు నెలల పాటు ఇంటివద్ద గడిపిన విద్యార్థులు హాస్టల్‌కు చేరుకోగానే వాతావరణ మార్పులతో అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని, పిల్లలందరికీ వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశించారు. వారం రోజుల పాటు పిల్లల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించాలని ఏఎన్‌ఎంలకు సూచించారు. సురక్షిత తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని, నూతన మెనూ ప్రకారం ఆహారం అందించాలని చెప్పారు. వసతిగృహాలు పురాతనంగా ఉన్నాయని, ఏమైనా మరమ్మతులు ఉంటే వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత వార్డెన్‌లపైనే ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. ఏమైనా సమస్యలుంటే వార్డెన్‌కు తెలియజేయాలని, చదువు పట్ల నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. భవిష్యత్ లక్ష్యాల సాధనకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ మణెమ్మ, హాస్టల్ వార్డెన్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా శ్రీహరి



ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరిని ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్‌చార్జి మంత్రులను నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్థానంలో శ్రీహరిని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్‌గా నియమించారు. అలాగే, పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఉమ్మడి వరంగల్‌కు కొనసాగిస్తూ, నల్లగొండ ఇన్‌చార్జ్‌గా ఉన్న తుమ్మల నాగేశ్వరరావును ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జిగా నియమించారు.

సింగరేణి డైరెక్టర్(పా)గా గౌతమ్ పొట్రు



గౌతమ్ పొట్రు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి డైరెక్టర్(పా)గా గౌతమ్ పొట్రును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న గౌతమ్.. గతంలో భద్రాచలం ఐటీడీఏ పీఓగా విధులు నిర్వర్తించారు. కాగా, 2014 నుంచి సింగరేణిలో పూర్తిస్థాయి డైరెక్టర్(పా) ఐఏఎస్‌ను నియమించకుండా సంస్థలో పనిచేస్తున్న అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. దీంతో పాలన కుంటుపడింది. రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఐఏఎస్ అధికారిని నియమించడం పట్ల కార్మికులు, కార్మిక సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు

డీఈఓ వెంకటేశ్వరా చారి



విద్యార్థికి యూనిఫామ్ అందిస్తున్న డీఈఓ వెంకటేశ్వరా చారి, పక్కన ఉపాధ్యాయులు

చుంచుపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉత్తమ బోధనతో పాటు మెరుగైన సౌకరాయలు కల్పిస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరాచారి అన్నారు. మండలంలోని పెనుబల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆయన విద్యార్థులకు నోట్, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉన్నత విద్యతో పాటు వారానికి మూడు రోజులు కోడిగుడ్లు, మరో మూడు రోజులు రాగిజావ వంటి పౌష్టికాహారం అందిస్తున్నామని, నిపుణులైన ఉపాధ్యాయులతో తరగతులు బోధిస్తున్నామని చెప్పారు. పిల్లలను రూ.లక్షలు ఖర్చు పెట్టి ప్రైవేట్ స్కూళ్లకు పంపించకుండా ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీ, పాఠశాల హెచ్‌ఎం నిర్మల, రాజయ్య, శారద హరిలాల్, విజయ, సుజాత, సెక్టోరియల్ అధికారి సైదులు, సీఆర్పీలు మధు, రవి పాల్గొన్నారు.

సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి
కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటుచేస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ ఎం.వెంకటేశ్వరా చారి అన్నారు. గురువారం ఆయన చుంచుపల్లిలోని జీహెచ్‌ఎస్, విద్యానగర్‌లోని ప్రాథమిక పాఠశాల, లక్ష్మీదేవిపల్లి, చాతకొండ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్న అధునాతన సౌకర్యాలు, నాణ్యమైన విద్య, జీవన నైపుణ్యాలు మరెక్కడా లభించవని అన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫామ్ అందజేశారు. పలు పాఠశాలల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈఓలు బాలాజీ, కృష్ణయ్య, జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు, ప్రధానోపాధ్యాయురాలు తబితా సంధ్యా రాణి తదితరులు పాల్గొన్నారు.

11 ఏళ్లుగా సుస్థిర పాలన



మాట్లాడుతున్న పేరాల శేఖర్ రావు

చుంచుపల్లి: గత 11 ఏళ్లుగా దేశంలో సుస్థిర పాలన సాగుతోందని బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకులు పేరాల శేఖర్‌రావు, పోరెడ్డి కిషోర్‌రెడ్డి అన్నారు. గురువారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రపంచంలోనే భారతదేశాన్ని అగ్రభాగంలో నిలిపేందుకు ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని చెప్పారు. ప్రజా సంక్షేమ విధానాలతో దేశ దశ దిశను మార్చారని తెలిపారు. తద్వారా ప్రజల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. అనేక రాష్ట్రాల్లో ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారని, త్వరలో తెలంగాణలోనూ పార్టీ హవా కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. జిల్లాలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు జీవీకే మనోహర్, నాయకులు విద్యాసాగర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన 2025–26వ విద్యాసంవత్సరానికి పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని ఖమ్మం డీఈఓ సత్యనారాయణ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. ఆగస్టు 31నాటికి 14ఏళ్లు నిండి, చదవడం, రాయడం రాని వారు పదో తరగతిలో, 15ఏళ్లు నిండి పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఇంటర్‌లో ప్రవేశాలకు అర్హులని వెల్లడించారు. పదో తరగతికి ప్రవేశానికి జనరల్ పురుషులు రూ. 1,550, మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మైనార్టీలకు రూ.1,150, ఇంటర్మీడియట్‌కు జనరల్ పురుషులైతే రూ.1,800, మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మైనార్టీలకు రూ.1,500 ఫీజు చెల్లించి జూలై 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే, అపరాధ రుసుంతో జూలై 12నుంచి ఆగస్టు 12వ తేదీ వరకు అవకాశం ఉంటుందని, వివరాలకు ఓపెన్ స్కూల్ సెంటర్లు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో పాటు 80084 03522 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చల్లారని మంటలు!

- రామయ్య భూముల వ్యవహారంలో తరచూ ఘర్షణ
- తాజాగా గ్రామస్తులు, ఆలయ సిబ్బంది నడుమ వాగ్వాదం
- భూముల అప్పగింతలో ఏపీ ప్రభుత్వ వైఫల్యం
- అవి తమవేనంటున్న రైతులు



వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు, దేవస్థానం సిబ్బంది (ఫైల్)

భద్రాచలం: శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భూముల వివాదం ఆగేలా లేదు. ఆలయ భూములున్న ఏపీలోని పురుషోత్తపట్నం గ్రామస్తులు, రైతులకు – దేవస్థానం సిబ్బందికి నడుమ జరుగుతున్న వాగ్వాదాలు, గొడవలు ఆరని మంటల్లా సాగుతూనే ఉన్నాయి. కోర్టు ఉత్తర్వుల ప్రకారం భూములు అప్పగించడంలో ఏపీ ప్రభుత్వం, అధికారుల వైఫల్యం ఉందని దేవస్థానం వర్గాలు అంటుండగా, ఆ భూములు తమవేనని పురుషోత్తపట్నం గ్రామస్తులు వాదిస్తున్నారు. దీంతో ఈ వ్యవహారం నిరంతర రణరంగంలా మారుతోంది.

ఏపీ ప్రభుత్వ వైఫల్యమే..
రామయ్య భూములను ఆలయానికి అప్పగించడంలో ఏపీ ప్రభుత్వం విఫలమైందని దేవస్థానం వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఈ భూములకు సంబంధించి గతంలో ఏపీ హైకోర్టుకు ఆధారాలతో వెళ్లగా, న్యాయస్థానం స్పష్టమైన తీర్పు ఇచ్చిందని చెబుతున్నాయి. 12 శాఖలకు చెందిన అధికారులు దేవస్థానానికి భూములను అప్పగించాల్సి ఉండగా, ఏళ్లు గడుస్తున్నా వారు పట్టించుకోవడం లేదని ఆలయ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా బుధవారం ఆలయ భూముల్లో రేకుల షెడ్ నిర్మిస్తుండగా సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో మళ్లీ వాగ్వాదం చోటుచేసుకుంది.

ఏపీ సీఎంను కలిసేందుకు ప్రణాళికలు..
ఏపీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు అమలయ్యేలా, ఆలయానికి భూములను అప్పగించేడాల చూడాలని ఏపీ సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు దేవాదాయ శాఖ మంత్రిని, ఉన్నతాధికారులను కలిసేందుకు దేవస్థానం అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ భూములను అప్పగించడంలో రెవెన్యూ, పోలీస్ శాఖలు సహకరించడం లేదని, దీంతోనే వాగ్వాదాలు, గొడవలు జరుగుతున్నాయని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపితే గాని రామయ్య భూములు స్వాధీనం కావని వివరించే అవకాశం ఉంది.

ముందుకు సాగని అభివృద్ధి
పురుషోత్తపట్నంలోని భూములు, వాటిపై వచ్చే ఆదాయం ఆలయానికి అందకపోవడంతో అభివృద్ధి పనులు ఎక్కడివక్కడే నిలిచిపోతున్నాయి. అయితే ఆ భూములు తమవేనని పురుషోత్తపట్నం గ్రామస్తులు వాదిస్తున్నారు. 917 ఎకరాల భూమిని సోమరాజు పురుషోత్తమదాసు అనే భక్తుడు 1878లో రామాలయానికి దానం చేశాడని, ఆ భూమిని నైజాం కాలంలో వరంగల్ తాలూకాలో వేలం వేయగా మహ్మద్ హుస్సేన్ సాహెబ్ అనే వ్యక్తి కొనుగోలు చేశాడని వారు చెబుతున్నారు. అనంతర కాలంలో ఆ భూములు క్రయ విక్రయాలు జరుగుతూ తమవద్దకు వచ్చాయని అంటున్నారు. దీనిపై తాము తెలంగాణ హైకోర్టును ఆశ్రయించామని, స్టేటస్ కో ఉందని వాదిస్తున్నారు.

ఆక్రమణలో 750 ఎకరాలు..
శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1,350 ఎకరాల భూములు ఉన్నాయి. ఇందులో అత్యధిక భాగం 889 ఎకరాల భూమి ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా పురుషోత్తపట్నం గ్రామంలో ఉంది. ఇందులో దాదాపు 750 ఎకరాల భూమి ఆక్రమణకు గురయి ఉంటుందని ఆలయ వర్గాలు భావిస్తున్నాయి. మిగిలిన భూమి అయినా కాపాడుకునేందుకు దేవస్థానం అధికారులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ భూముల్లోనే సుమారు 104 ఎకరాల్లో గోశాలతో పాటు చెరువు, ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నారు. అయితే ఈ భూములను ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న రైతులు.. తరతరాలుగా తమవేనని వాదిస్తున్నారు. జామాయిల్ సాగుతో పాటు శాశ్వత నిర్మాణాలు, ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ఇలా నిర్మాణాలు చేపట్టినప్పుడల్లా ఆలయ అధికారులు, సిబ్బంది అడ్డుకోవడం, వాగ్వాదం జరగడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో తోపులాటలు, భౌతిక దాడులతో రామయ్య భూములు రణరంగంగా మారుతున్నాయి.

మా భూమి ఇప్పించండి

కలెక్టరేట్ ఎదుట ఆదివాసీల ఆందోళన



ఆదివాసీలు సమర్పించిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): అశ్వారావుపేట నుంచి కొత్తగూడెం వరకు గత మూడు రోజులుగా పాదయాత్ర చేసిన ఆదివాసీలు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సుమారు 80 కిలోమీటర్లు పాదయాత్ర చేసి తమ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకురావాలనే సంకల్పంతో ఐడీఓసీకి వారు చేరుకున్నారు. అశ్వారావుపేట మండలం రామన్నగూడేనికి చెందిన ఆదివాసీలు సర్వే నంబర్ 30, 36, 39లో 1954 నుంచి 150 కుటుంబాలు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాయని ఆదివాసీ నాయకుడు మడకం నాగేశ్వరరావు తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకాలు కూడా ప్రభుత్వం ఇచ్చిందని, సాగు చేసుకుంటున్న 573 ఎకరాల భూమి ఆదివాసీలదేనని హైకోర్టు సైతం 2011లో స్పష్టమైన తీర్పు ఇచ్చిందని అన్నారు. అయినా అటవీ శాఖాధికారులు వ్యవసాయం చేయనివ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలకు అన్యాయం చేస్తున్న అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న అదనపు కలెక్టర్ ధర్నా వద్దకు చేరుకుని కలెక్టర్‌కు సమస్యలు వివరించి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

క్లుప్తంగా

కేసీఆర్‌ను కలిసిన దిండిగాల


కేసీఆర్‌తో దిండిగాల రాజేందర్

ఇల్లెందు: మాజీ సీఎం కేసీఆర్‌ను హైదరాబాద్‌లోని ఆయన ఇంటి వద్ద ఇల్లెందు బీఆర్‌ఎస్ నాయకుడు దిండిగాల రాజేందర్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతోందని, పాలనలో విఫలమైందని ఆరోపించారు.

అటవీ సంపదను ధ్వంసం చేస్తే చర్యలు

దుమ్ముగూడెం: అటవీసంపదను ధ్వంసం చేస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా అటవీశాఖ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదలైంది. దుమ్ముగూడెం మండలంలో అటవీ అధికారుల విధులను అడ్డుకుని, ప్లాంటేషన్ ధ్వంసం చేసిన ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇద్దరిని అరెస్ట్ చేయగా, కాక సమ్మయ్య అనే వ్యక్తిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఏడు రోజుల రిమాండ్ విధించారని తెలి పారు. గొంది కమల అనే మహిళను స్వంత పూచీకత్తుపై విడుదల చేశామని పేర్కొన్నారు.

కుమారుడు అన్నం పెట్టలేదని ఫిర్యాదు

తల్లాడ: గొడవ పడిన తన కుమారుడు భోజనం పెట్టలేదంటూ ఓ తల్లిని పోలీసులను ఆశ్రయించింది. తల్లాడ మండలం నారాయణపురానికి చెందిన చల్లా తిరపతమ్మకు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అందరి వివాహాలు జరగగా కుమారుడైన చల్లా అశోక్(తంబి) వద్ద ఆమె ఉంటోంది. అయితే, బుధవారం తల్లితో గొడవపడిన ఆయన భోజనం పెట్టకపోవడంతో తిరపతమ్మ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

అథ్లెటిక్స్ అకాడమీలో ప్రవేశానికి పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని అథ్లెటిక్స్ అకాడమీలో ఎంపికకు జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యాన గురువారం సర్దార్ పటేల్ స్టేడియంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని పది జిల్లాలనుంచి 30 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, నారాయణపేట, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, మంచిర్యాల, సంగారెడ్డి జిల్లాల క్రీడాకారులు హాజరుకాగా, సర్టిఫికెట్లు పరిశీలించిన అనంతరం ఫిజికల్ టెస్ట్, ఈవెంట్లలో పోటీలు నిర్వహించారు. ఈమేరకు ప్రతిభతో పాటు వైద్య పరీక్షల అనంతరం అర్హులకు అకాడమీ లో ప్రవేశం కల్పించనున్నారు.డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి, అథ్లెటిక్స్ అకాడమీ చీఫ్‌కోచ్ ఎం.డీ.గౌస్, కోచ్‌లు ఎం.శ్రీనివాసరావు, ఎం.డీ.అక్బర్ అలీ, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్, మేనేజర్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకోని సాగు

- వర్షాభావ పరిస్థితులతో ముమ్మరంకాని వ్యవసాయ పనులు
- జిల్లాలో ఇప్పటివరకు 27,620 ఎకరాల్లోనే పంటల సాగు
- వానాకాలంలో సాధారణ సాగు విస్తీర్ణం 6,03,124 ఎకరాలు


ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

సూపర్‌బజార్(కొత్తగూడెం): వానాకాలం సీజన్‌లో రైతులు పంటల సాగు మొదలుపెట్టినా ఇంకా ఊపందుకోలేదు. తొలకరి పలకరించినా వర్షాభావ పరిస్థితులతో ఒకింత ఆందోళన చెందుతున్నారు. నీటి వనరులు ఉన్న చోట సాగుకు సమాయత్తమవుతున్నారు. వర్షాధార ప్రాంతాల్లో అన్నదాతలు ఆకాశంకేసీ చూస్తున్నారు. జిల్లాలోని 23 మండలాల్లో వ్యవసాయ శాఖ అధికారిక గణాంకాల ప్రకారం 21,016 ఎకరాల్లో పత్తి సాగు చేపట్టారు. అధికంగా టేకులపల్లి మండలంలో 8,036 ఎకరాలు, అశ్వాపురం మండలంలో 1,980 ఎకరాలు, బూర్గంపాడు మండలంలో 7,250 ఎకరాలు, సుజాతనగర్ మండలంలో 845 ఎకరాల్లో పత్తి విత్తారు. మొక్క జొన్న 69 ఎకరాలు, పెసర 22 ఎకరాలు, పచ్చిరొట్ట ఎరువు కోసం ఉపయోగించే జీలుగు 3,087 ఎకరాలు, జనుము 152 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మొత్తం 27,620 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా వానాకాలంలో వ్యవసాయ, ఉద్యాన పంటలు 6,03,124 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. పూర్తిస్థాయిలో వర్షాలు లేకపోవడంతో కేవలం 27,620 ఎకరాల్లోనే రైతులు సాగు పనులు చేపట్టారు. రాబోయే రోజుల్లో వర్షాలు పెరిగితే ముమ్మరంగా వ్యవసాయ పనులు చేపట్టనున్నారు.

10 మండలాల్లో వర్షాభావం..

జిల్లాలో 10 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. కరకగూడెం, పినపాక, దుమ్ముగూడెం, అశ్వాపురం, మణుగూరు, ఆళ్లపల్లి, గుండాల, ఇల్లెందు, భద్రాచలం, ములకలపల్లి మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అన్నపురెడ్డిపల్లి, చుంచుపల్లి, బూర్గంపాడు, అశ్వారావుపేట, లక్ష్మీదేవిపల్లి మండలాలలో సాధారణ వర్షపాతం నమోదైంది. చర్ల, టేకులపల్లి, జూలూరుపాడు, చంద్రుగొండ, సుజాతనగర్, కొత్తగూడెం, పాల్వంచ, దమ్మపేట మండలాలలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. జిల్లాలో ఈ నెల 1వ తేదీ నుంచి ఇప్పటివరకు 37.9 మి.మీ సరాసరి వర్షపాతం నమోదైంది.

ఎదురుచూస్తున్నాం


ఏరువాక పౌర్ణమి దాటినప్పటికీ వర్షాలు ఆశించినస్థాయిలో కురవడంలేదు. వర్షాలు పడితే వ్యవసాయ పనులను ముమ్మరం చేద్దామని ఎదురు చూస్తున్నాం. విత్తనాలు సిద్ధం చేసుకున్నాం.

–రాజ్‌కుమార్, చిట్టిరామవరం

దుక్కులు దున్నుతున్నాం


కురిసిన వసర్షాలకు అనుగుణంగా వ్యవసాయానికి సాగు పనులు చేపట్టాం. భూములను కలియ దున్నుతున్నాం. ఈసారి పంటలకు అవసరమైన వర్షాలు కురవాలని ఆశిస్తున్నాం.

–ఈసం శ్రీరామ్మూర్తి, కరకగూడెం

పనులు ప్రారంభమయ్యాయి..


వానాకాలం సాగు పనులు ప్రారంభమయ్యాయి. ఇంకా ఊపందుకోలేదు. వర్షాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయాధికారుల సూచనలతో పంటలు వేయాలి.

–వి.బాబూరావు, జిల్లా వ్యవసాయాధికారి

గంజాయి సీజ్


వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

భద్రాచలంఅర్బన్: అక్రమంగా తరలిస్తున్న 4.2 కేజీల గంజాయిని గురువారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. పట్టణంలోని కూనవరం రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టిన అధికారులు మూడు బైక్‌లను స్వాధీనం చేసుకుని, ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో పాల్వంచకు చెందిన ముగ్గురు మైనర్లతోపాటు ఏపీలోని ఏలూరుకు చెందిన పసుపులేటి నాగకుమార్, వంజరపు శ్రీనివాస్, అభిషేక్ ఉన్నారు. వీరు ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి పాల్వంచకు, అక్కడి నుంచి ఏలూరుకు గంజాయి తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. నిందితులను, వాహనాలను స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ అప్పగించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ శ్రీ హరిరావు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

అశ్వారావుపేటరూరల్: పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న యువకుడిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఎస్సై యయాతిరాజు కథనం ప్రకారం.. పట్టణంలోని వడ్డెర బజార్‌కు చెందిన యువకుడు మక్కెళ్ల మారేష్ మండలంలోని ఓ ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల బాలికపై కొద్దిరోజులుగా ప్రేమపేరుతో లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. బాధితురాలి తల్లి ఈ నెల 2న ఫిర్యాదు చేయగా, అదే రోజు పోక్సో కేసు నమోదు చేశారు. గురువారం నిందితుడిని అరెస్ట్ చేసి దమ్మపేట కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారని ఎస్సై తెలిపారు.

బెల్లం, పటిక స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

జూలూరుపాడు: మండలంలోని సాయిరాంతండాలో నాటు సారా తయారీకి ఉపయోగించే రెండు క్వింటాళ్ల నల్లబెల్లం, 40 కిలోల పటికను గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు హలావత్ శ్రీనుపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. నల్లబెల్లం విలువ రూ 23,400, పటిక విలువ రూ .1200 ఉంటుందని జూలూరుపాడు సీఐ ఇంద్రసేనా రెడ్డి తెలిపారు.

కరకగూడెంలో...

కరకగూడెం: మండలంలోని కలవలనగారం గ్రామ అటవీ శివారులో అక్రమంగా నిల్వ చేసిన 15 క్వింటాల బెల్లం, 10 కేజీల పటిక, 10 లీటర్ల గుడుంబాను బుధవారం రాత్రి ఎక్సైజ్ సిబ్బంది, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మణుగూరులోని ఎక్సైజ్ కార్యాలయానికి తరలించి, నిందితుడు కె.సాగర్‌పై కేసు నమోదు చేసినట్లు మణుగూరు ఎక్సైజ్ సీఐ రాజిరెడ్డి తెలిపారు.

వేగంగా భూముల రీసర్వే


రీ సర్వేను పరిశీలిస్తున్న ఏడీ శ్రీనివాసులు

ఎర్రుపాలెం: భూముల రీ సర్వే కోసం మండలంలోని ములుగుమాడును పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఈమేరకు గ్రామంలో జరుగుతున్న భూముల సర్వే ను జిల్లా ల్యాండ్ అండ్ సర్వే ఏడీ శ్రీనివాసులు గురువారం పరిశీ లించారు. సర్వేలో తీసుకోవాల్సి న జాగ్రత్తలపై ఉద్యోగులకు సూచనలు చేసిన ఆయన మరింత వేగం పెంచా లని ఆదేశించారు. సర్వేయర్ రాజశేఖర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

గంగానమ్మ ఆలయంలో చోరీ


ఆలయంలో ఉన్న హుండీని ధ్వంసం చేసిన దుండగులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి సమీపంలో ఉన్న పెదవాగు ప్రాజెక్టు వద్ద గల శ్రీ గంగానమ్మ తల్లి ఆలయంలో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఆలయం తలుపు తెరిచి లోపల ఉన్న రెండు హుండీలను ధ్వంసం చేసి సుమారు రూ.50 వేలు అపహరించినట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలి పారు. పోలీసులకు సమాచారం అందించగా, ఎస్సై యయాతిరాజు దర్యాప్తు చేపట్టారు.

బాలలు బడిలోనే ఉండాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): బడి ఈడు బాలలందరూ బడిలో ఉండాలని, బాలకార్మికులుగా ఎవరూ మిగిలి పోకూడదని జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. ప్రపంచ బాలకార్మి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ (ఎయిడ్) సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆయన కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైనందున బడిఈడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. బాలలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాల కార్మిక రహిత జిల్లాగా రూపొందించడానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తొలుత పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎండి షర్ఫుద్దీన్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి హరికుమారి, డీసీపీయూ యూనిట్ బాధ్యులు అజీజ్, నాగరాజు, ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం పిల్లలిద్దరూ ప్రభుత్వ పాఠశాలలోనే..


కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న హెచ్‌ఎం బాణోతు లక్ష్మా

టేకులపల్లి: మండలంలోని గోలియాతండా పంచాయతీ వాగొడ్డుతండా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బాణోతు లక్ష్మా(దివ్యాంగుడు) తన పాఠశాలలోనే ఐదో తరగతి పూర్తి చేసిన కుమారుడిని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతిలో చేర్పించాడు. కూతురిని ఇప్పటికే టేకులపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిస్తున్నాడు. ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తూ పలువురుగా ఆదర్శంగా నిలిచాడు. ఈ సందర్భంగా లక్ష్మాను హైస్కూల్ హెచ్‌ఎం మేరుగు శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు. తుమ్మలచెలక హెచ్‌ఎం పూల్‌సింగ్ చొరవ తీసుకుని గ్రామం నుంచి ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్న ఎనిమింది మంది విద్యార్థులను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. పాఠశాలల పునః ప్రారంభం రోజు గురువారం బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పూలు , పెన్నులు, పెన్సిళ్లు , ఎరేజర్లు అందజేసి స్వాగతించారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందజేశారు. హెచ్‌ఎం జర్పల పద్మ, ఉపాధ్యాయులు నీరజ షారోన్‌తోపాటు లోగాని శ్రీనివాస్, మహమ్మద్ ఖాసిం, జ్యోతి రాణి పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించండి

నకిలీ విత్తనాల కేసులో ఫోరం తీర్పు

ఖమ్మంలీగల్: నకిలీ విత్తనాలను అమ్మిన విత్తన కంపెనీలు పరిహారంగా 26 మంది రైతులకు రూ. 17.50 లక్షలు, విత్తన ఖరీదుతో అదనంగా రూ. 10వేలు కేసు ఖర్చుగా చెల్లించాలని ఖమ్మం జిల్లా వినియోగదారుల ఫోరం గురువారం తీర్పు చెప్పింది. ముదిగొండ మండలంలోని గోకినపల్లి, కట్టకూరు గ్రామాల్లో 26 మంది రైతులు 2021 ఏడాదిలో సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కొడకండ్లలోని సిరి ఫెర్టిలైజర్స్ 114 ఎకరాల్లో 14 ప్యాకెట్ల పొద్దుతిరుగుడు విత్తనాలు కొనుగోలు చేశారు. మహారాష్ట్రలోని పుణె సమీపంలోనిమాన్సూన్ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఈ విత్తనాలు నాటాక పంట సరిగా పండలేదు. ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పరిశీలించి ఇచ్చిన నివేదికతో అవి నకిలీ విత్తనాలుగా తేలింది. దీంతో వినియోగదారుల ఫోరంను ఆశ్రయించగా రైతులకు పరిహారం, విత్తనాల ఖరీదు చెల్లించాలని తీర్పు వెలువరించింది.



స్కూటీని ఢీకొట్టిన లారీ

రిటైర్డ్ ఐటీసీ ఉద్యోగి మృతి


రాజేశ్వరరావు(ఫైల్)

బూర్గంపాడు: సారపాకలోని ఆర్చ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐటీసీ రిటైర్డ్ ఉద్యోగి మృతిచెందాడు. సారపాకలోని మసీద్ రోడ్డులో నివాసముంటున్న గంగుల రాజేశ్వరరావు(65) గురువారం సాయంత్రం సారపాక సెంటర్ నుంచి స్కూటీపై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో భద్రాచలం వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో రాజేశ్వరరావు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ చక్రాల కిందపడటంతో సుమారు 20 మీటర్ల మేర ఈడ్చుకెళ్లడంతో శరీరం ఛిద్రమైంది. అతనిని గుర్తు పట్టేందుకు స్థానికులకు కూడా అరగంట సమయం పట్టింది. ఎస్‌ఐ రాజేశ్ సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతుడు రాజేశ్వరరావు ఐటీసీ పీఎస్‌పీడీలో రా మెటీరియల్ విభాగంలో మేనేజర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందాడు. మృతుడికి భార్య, పిల్లలున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొని వ్యక్తి మృతి


ఊకే రాము (ఫైల్)

సత్తుపల్లిరూరల్: ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొట్టగా వాహనదారుడు మృతి చెందాడు. సత్తుపల్లి శివారులో గురువారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. సత్తుపల్లి మండలం కుమురంభీం కాలనీకి చెందిన ఊకే రాము (45), ఏసుబాబు సత్తుపల్లి నుంచి గంగారంవైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు ఏలూరు వెళ్తూ పట్టణ శివారు పెద్ద వంతెన సమీపా వీరి వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమాన్ని తాకడంతో ఊరే రాము బస్సు వెనుక టైర్ల కిందపడగా తీవ్రగాయాలతో మృతి చెందాడు. అలాగే, ఏసుబాబు కూడా గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. మృతుడు రాము భార్య నాలుగేళ్ల క్రితం మృతిచెందగా ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గతంలో తల్లిని ఇప్పుడు తండ్రిని కోల్పోయిన కుమార్తెలు రోదించడం అందరినీ కంటతడి పెట్టించింది.

ట్రాక్టర్ పైనుంచి పడి డ్రైవర్..

తిరుమలాయపాలెం: దుక్కి దున్నేందుకు వెళ్లిన ట్రాక్టర్ డ్రైవర్ ప్రమాదవశాత్తు కింద పడడంతో మృతి చెందాడు. మండలంలోని పిండిప్రోలుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కిలారు ఉపేందర్(39) బుధవారం మధ్యాహ్నం ఓ రైతు చేను దున్నేందుకు వెళ్లాడు. ఈక్రమాన ట్రాక్టర్ బండరాయిపైకి ఎక్కడంతో అదుపు తప్పగా కింద పడిన ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఖమ్మంకు అక్కడి నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా మృతి చెందాడు. ఉపేందర్‌కు భార్య త్రివేణి ఉండగా, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

117 మందికి జరిమానా

సూపర్‌బజార్(కొత్తగూడెం): మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో 117 మందికి జరిమానా విధిస్తూ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు గురువారం తీర్పు చెప్పారు. కొత్తగూడెం వన్‌టౌన్ పరిధిలో 24 మంది, ట్రాఫిక్ స్టేషన్ పరిధిలో 13మంది, కొత్తగూడెం టూటౌన్ పరిధిలో 30 మంది, సుజాతనగర్ పరిధిలో 10మంది, చంద్రుగొండ పరిధిలో 10మంది, ములకలపల్లి స్టేషన్ పరిధిలో 30మంది మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి జరిమానా విధించారు.

ప్రాణం తీసిన పాల డబ్బుల గొడవ

అశ్వారావుపేటరూరల్: పాలు పోసిన డబ్బుల విషయంలో జరిగిన గొడవ ఓ మహిళ ప్రాణాలు తీసింది. ఈ సంఘటన గురువారం జరిగింది. ఎస్సై యయాతిరాజు కథనం ప్రకారం.. పట్టణంలోని నందమూరినగర్ కాలనీకి చెందిన గొల్ల సత్యవతి అదే కాలనీకి చెందిన షేక్ సమీరాను పాలు పోసిన డబ్బులు ఇవ్వాలని అడిగింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం నెలకొంది. అదే సమయంలో ఇంట్లో ఉన్న సమీరా బంధువు మౌలాబీ రావడంతో పరస్పరం దాడులు చేసుకున్నారు. గమనించిన గొడవను ఆపేందుకు వెళ్లిన సత్యవతి తల్లి గుండుబోయిన మంగ(40)ను కూడా నెట్టివేశారు. ఒక్కసారిగా కింద పడిపోయిన మంగ కొద్ది సేపట్లోనే తీవ్ర అస్వస్థతకు గురై అపస్మారస్థితిలోకి వెళ్లింది. గమనించిన స్థానికులు అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలిచగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే గుండెపోటుకు గురై మృతి చెందిందనితెలిపారు. మృతురాలి కుమార్తె సత్యవతి ఫిర్యాదుతో మృతికి కారణమైన షేక్ సమీరా, మౌలాబీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

కార్మిక సమస్యలపై బీఎంఎస్ ఆందోళన

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు పరిశ్రమల అభివృద్ధి, కార్మిక సమస్యల పరిష్కారానికి ఏబీకేఎంఎస్ అనుబంధ బీఎంఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టనున్నట్లు ఆ సంఘం కార్యదర్శి పి. మాధవనాయక్ తెలిపారు. ఇటీవల బిలాస్‌పూర్‌లో జరిగిన యూనియన్ పదాధికారుల సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను గురువారం ఆయన వివరించారు. సింగరేణిలో ఉత్పత్తి పేరుతో కాంట్రాక్ట్‌ల ఆధారిత విధానం విపరీతంగా పెరిగిందని, కార్మికుల భవిష్యత్‌కు హానికరమని పేర్కొన్నారు. జూలై 1 నుంచి 10వ తేదీ వరకు పిట్ మీటింగ్‌లు, గేట్ మీటింగ్‌లు నిర్వహించి కార్మికులకు అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. 14న జీఎం కార్యాయాల దుట ధర్నాలు, 15 నుంచి 25 వరకు జనసంపర్క అభియాన్ కార్యక్రమాలు, ఆగస్ట్ 1 నుంచి 10వ తేదీ వరకు పబ్లిక్ మీటింగ్‌లు, మీడియా సమావేశాల ద్వారా ప్రజలలో చైతన్యం కల్గించే కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.